క్లుప్తంగా

నమో శివరుద్రాయ



పూజలందుకున్న శివలింగం

మల్కాపురం: స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి ఆలయ అర్చకులు తొలుత పంచామృతాలతో అభిషేకించారు.అనంతరం బిల్వ పత్రాలు,విభూదితో అర్చనలు చేశారు. ఆలయ అర్చకులు ఇక్కడ దర్శనానికి వచ్చిన భక్తులకు శివపురాణం,శివదీక్ష వల్ల కలిగే ముక్తి గురించి వివరించారు.

అనాథాశ్రమానికి వితరణ



నిత్యావసర సరకులు అందిస్తున్న బాలుభార్గవ్

కంచరపాలెం: సినీ నటుడు మంచు మనోజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని సోమవారం వైజాగ్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ బాలు భార్గవ్ ఆధ్వర్యంలో 104 ఏరియాలోని కేర్ అండ్ లవ్ అనాథాశ్రమంలో అనాథలకు నిత్యావసర సరకులు అందజేశారు. ముందుగా పిల్లల సమక్షంలో కేక్ కట్‌చేశారు. అనాథలకు భోజనాలు ఏర్పాటు చేశారు. విశాఖలో మనోజ్ అభిమానులు వందల సంఖ్యలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు బాలుభార్గవ్ తెలిపారు. కార్యక్రమంలో శివ హేమంత్, పవన్, జెమిని గణేష్, చైతన్య, శంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు



ప్రకాష్‌నగర్‌లో పనిచేయని తాగునీటి బోరు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ప్రకాష్ నగర్‌లో నీటి ఎద్దడితో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకాష్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉన్న తాగునీటి బోరు పనిచే యక పోవడంతో మంచినీటికి అవస్థలు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే బోరు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

చురుగ్గా గోతుల పూడ్చివేత



ఇందిరానగర్‌లో పూడ్చుతున్న గోతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ఇందిరా నగర్‌లో నిరంతర మంచినీటి సరఫరా పనుల కోసం తవ్విన గోతుల పూడ్చి వేత పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో గొయ్యల వల్ల పడిన ఇబ్బందులు తొలుగుతున్నాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.

చిల్డ్రన్ పార్కు కళ కళ

విద్యుత్ లైట్లతో నూతన శోభ

మల్కాపురం: వుడా కాలనీ వాసుల కల సాకారం అయింది. వారు కోరిన దానికంటే మిన్నగా పార్కును తీర్చిదిద్దారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలో సుమారు 15 సెంట్ల విస్తీర్ణంలో పార్కు ఏర్పాటు చేశారు.అయితే నిర్వహణ లేక కొన్నేళ్లుగా ఈ పార్కు అధ్వానంగా మారింది. కాలనీ వాసులు విషయాన్ని వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ద్వారా వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి హెచ్‌పీసీఎల్ యంత్రాంగంతో పాటు జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి పార్కు అభివృద్ధి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన హెచ్‌పీసీఎల్ యాజమాన్యం సుమారు రూ. 35 లక్షలు, జీవీఎంసీ సుమారు రూ.20 లక్షలతో సంయుక్తగా కళావిహీనంగా ఉన్న పార్కును అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు.



విద్యుత్ వెలుగుల్లో చిల్డ్రన్ పార్కు



విద్యుత్ వెలుగులు, పచ్చటి మొక్కలతో ఆకట్టుకుంటున్న పార్కు

వెలుగులు.. జిలుగులు

పార్కును అభివృద్ధి చేయడంతో పాటు అత్యాధునిక లైటింగ్ ఏర్పాటు చేయడంతో కళకళలాడుతోంది. పిల్లలకు ఆట పరికరాలతో పాటు వ్యాయామానికి వీలుగా జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు కొంత చందాలు వేసుకుని కాలనీ చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. సాయంత్రం సమయంలో విద్యుత్ వెలుగుల మధ్య సుందరంగా కనిపిస్తున్న పార్కు అందాలను చూసి మైమరిచి పోతున్నారు.గంటల తరబడి ఇక్కడే కాలక్షేపం చేస్తున్నారు. ఓ వైపు పచ్చటి మొక్కలు, మరో వైపు అందమైన విద్యుత్ వెలుగులు వారిని కట్టిపడేస్తున్నాయి.

వైభవంగా పెంటమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకున్న కార్పొరేటర్ పూర్ణశ్రీ యాదవ్, సురేష్ యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్‌నగర్ గ్రామదేవత పెంటమాంబ పండగను సోమవారం వైభవంగా నిర్వహించారు. 45వ మహోత్సవం సందర్భంగా వేకువ జాము నుంచే అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు,కుంకుమలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రసాదాలతో పాటు అమ్మవారి రూపంతో కూడిన ప్రతిమ అందించారు. వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్,ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వర రావుయాదవ్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం తీర్థం కనుల పండువగా జరిగింది.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పుస్తక పఠనంతో మేధో వికాసం



పుస్తక పఠనంపై చిన్నారులకు సూచనలిస్తున్న రచయిత సత్తిరాజు

మల్కాపురం: పుస్తక పఠనం వల్ల మెరుగైన ఆలోచనలు వస్తాయని, ఊహా శక్తి పెరుగుతుందని ప్రముఖ రచయిత కె.సత్తిరాజు అన్నారు. మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు చదవడం వల్ల ఒత్తిడి తగ్గుతుందని, జ్ఞాపకశక్తి పెరుగుతుందని, మానసిక ఉల్లాసం , ఉత్తేజం కలుగుతుందన్నారు. కొన్ని పుస్తకాలు సమాజ సేవకు అంకితం అయ్యేలా చేస్తాయన్నారు. నీతి కథలు చదవడం, ప్రముఖుల జీవిత విశేషాలు తెలుసుకోవడం వల్ల వ్యక్తిత్వ వికాసం లభిస్తుందన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన గ్రంథాలయాధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ మల్కాపురం శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు ప్రత్యేక పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మద్యపానం, మత్తుపదార్థాల వాడకం వల్ల అనేక నష్టాలు వస్తాయని వివరించారు. అత్యాచారాలకు, రోడ్డు ప్రమాదాలకు, దోపిడీ, దొంగతనాలకు, శాంతిభద్రత విఘాతానికి మద్యపానం ప్రధాన కారణమన్నారు. 12 సంవత్సరాలు లోపు చిన్నారులు నీతికథలు చెప్పారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలని పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు షిప్‌యార్డ్‌కాలనీలోని శ్రీసోమశేఖర పంచాయతన దేవస్థానంలో సోమవారం వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి రావాలని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అత్యధిక మెజారిటీతో గెలుపొందాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మీసాల సత్యనారాయణ, గన్నిరెడ్డి నరసింహమూర్తి, గుమ్మడి అప్పారావు, అన్నెపు అప్పారావు, సోరాడ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి స్వర్ణ పుష్పార్చన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

అన్నమయ్య సంకీర్తనల శిక్షణ ప్రారంభం



అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న జ్యోతిర్మయి

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లోని భక్త తుకారాం ఆలయ ప్రాంగణంలో సోమవారం అన్నమయ్య సంకీర్తన శిక్షణ శిబిరం ప్రారంభమైంది. శ్రీవెంకటేశ్వర స్వామి సంకీర్తనల రాయబారి కొండవీటి జ్యోతిర్మయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు శిబిరం కొనసాగతుంది. ఈ శిక్షణలో పాల్గొన్న సుమారు 100 మందికి అన్నమయ్య సంకీర్తనల గురించి జ్యోతిర్మయి వివరించారు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో భక్త తుకారాం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి జయరాం, జాయింట్ సెక్రటరీ సోమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణలో ఉత్సవమూర్తులు



స్వామివారికి ప్రత్యేక సేవలు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా ముగిసాయి. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామి వారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి రప్పించిన పలు రకాల పుష్పాలతో పుష్పయాగం చేశారు. స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. విశేష అర్చనలు, ఊంజల్ సేవ జరిపారు. అనంతరం వేద మంత్రోచ్చరణ నడుమ మహా పూర్ణాహుతితో ఉత్సవాలు ముగిసాయి. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో ఈవో నీలిమ, ఎంఎస్ రాజు పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతోంది. భక్తులు వేలాదిగా తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సహస్ర నామార్చన ఘనంగా జరిగింది. 1001 నామాలు పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ట్రాఫిక్ చక్రబంధం

- అగనంపూడి హనుమాన్ టెంపుల్ జంక్షన్‌లో నిత్యం సమస్య
- ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్
- ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు వాహనచోదకుల వినతి



అగనంపూడి మరిడిమాంబ ఆలయ కూడలి



ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

అగనంపూడి: జాతీయ రహదారి అగనంపూడి హనుమాన్ టెంపుల్ జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కూడలి వద్ద ఎనిమిది నుంచి పది నిమషాల పాటు ట్రాఫిక్‌లో చిక్కుకోవల్సి వస్తుండడంతో వాహనచోదకులు హైరానా పడుతున్నారు. గాజువాక, అనకాపల్లి వైపు వెళ్లే మార్గాల్లో రోడ్డు కుదించుకుపోయి ఉండడంతో ట్రాఫిక్‌కు మరింత ఇబ్బంది కలుగుతోంది. గాజువాక వైపు నుంచి వచ్చే ఫార్మా ఉద్యోగుల వాహనాలు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఉదయం భారీగా ఉండడంతో వంద నుంచి రెండొందల మీటర్ల వరకు వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. అలాగే ఉదయం ఎనిమిది నుంచి తొమ్మిది గంటల సమయంలో అగనంపూడి, లంకెలపాలెం ప్రాంతాల నుంచి ఉద్యోగులు, విద్యార్థులు కూడా ఈ చక్రబంధంలో చిక్కుకుంటున్నారు.

శాఖల సమన్వయంతోనే సమస్య పరిష్కారం

కూడలి వద్ద ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. దీని వల్ల సిగ్నల్‌తో పనిలేకుండా నేరుగా వెళ్లే వాహనాలు ముందుకు కదిలే అవకాశం ఉంటుంది. కేవలం సిగ్నల్ పాయింట్ వద్ద కుడివైపు రాకపోకలు సాగించే వాహనాలు తప్ప ఇతర వాహనాలు కూడలి వద్ద వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఈ సమస్యపై గతంలోనూ సాక్షిలో కథనం వెలువడగా, చర్యలు తీసుకుంటున్నామని అధికారులు అప్పట్లో ప్రకటించారు. కానీ ఆ దిశగా చర్యలు కానరావడం లేదు. జాతీయ రహదారుల సంస్థ, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ, జీవీఎంసీ, పోలీస్ శాఖ సమన్వయంతో వ్యవహరిస్తే తప్ప సమస్య పరిష్కారం అయ్యే అవకాశం కనపడడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాల విక్రయాలు

చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

సీతమ్మధార: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న చైతన్య, నారాయణ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) విశాఖ జిల్లా కమిటీ సహాయ కార్యదర్శి జి.అజయ్ డిమాండ్ చేశారు. రామాటాకీస్ దరి శ్రీచైతన్య, నారాయణ కళాశాలల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం అధిక ధరలకు విద్యార్థులకు విక్రయిస్తున్న పుస్తకాలు, యూనిఫారాలను పట్టుకుని ధర్నా చేసినట్లు చెప్పారు. జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు, ప్రభుత్వ అధికారులు ప్రతి విద్యా సంస్థలో తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ప్రతి కళాశాల వద్ద ధర్నా, ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు పి.సాయితేజ, అఖిల్, హర్షిత, సూర్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా తొలేళ్ల సంబరం



అమ్మవార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో కుంచుమాంబ

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని రెడ్డి కంచరపాలెం ప్రజల ఆరాధ్య దైవాలు కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల తొలేళ్ల సంబరం శ్రీరామ సేవా సమాజం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా జరిగింది. అల్లిపురం, కాన్వెంట్ జంక్షన్, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులు పేట, రెడ్డి కంచరపాలెం, ఊర్వశి కూడలి వరకు అమ్మవారి ప్రతిమలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిమను పుట్టబంగారం వద్దకు చేర్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. మంగళవారం అమ్మవార్ల ప్రధాన జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఐదో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రామ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అప్పన్న సన్నిధిలో ఏపీ జెన్‌కో ఎండీ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చక్రధరబాబు దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరబాబు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాన్ని ఏఈవో ఆనంద్ కుమార్ అందజేశారు.

'గైస్' అభివృద్ధికి సహకారం



కంచరపాలెం కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలను సందర్శించిన పూర్వ విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెంలోని గవర్నమెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్(గైస్) అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కెమ్‌దోస్తా పూర్వ విద్యార్థులు తెలిపారు. ఈ మేరకు 1979-1983 బ్యాచ్‌కు చెందిన ఎస్.ఆర్.శర్మ, గోపీకృష్ణ, ఎస్.సత్యనారాయణ, బీఎస్ రామ మోహన్, జాన్ రత్నంతో కూడిన పూర్వ విద్యార్థుల బృందం సోమవారం కళాశాలను సందర్శించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర అధ్యాపకులతో సమావేశమయ్యారు. కాలేజీలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులు, అవసరమైన ఇతర సదుపాయాల వివరాలను వీరు తెలుసుకున్నారు. గైస్‌లో సౌకర్యాల కల్పనకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు.

నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దుదాం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను ఉపయోగించి నగరంలో కాలుష్యాన్ని అరికట్టేందుకు, విశాఖను కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు నగర ప్రజలు సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. తన బంగ్లా నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సోమవారం ఆయన సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను ఉపయోగించాలనే నిర్ణయం మేరకు అధికారులు, సిబ్బంది ప్రజా రవాణాను ఉపయోగిస్తున్నారన్నారు. ఎకో - వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో ఎకో - జీరో పొల్యూషన్‌లో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టి అమలు చేస్తోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించాలని కోరారు.